జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 1-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 743 పేజీలు: 4 వెల : రూ.7

# మహిళా ఎస్ఐపై దౌర్జన్యం..
# 21 మందిపై కేసు




క్రైం వార్తలు



**ఆమదాలవలస, జులై 31 (వార్త):** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకాకుళం పర్యటన సందర్భంగా కొత్తరోడ్డు కూడలి వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న బూర్జ మహిళా ఎస్ఐ ప్రవల్లికతో అనుచితంగా ప్రవర్తించిన వైసీపీ నేతలపై ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో మొత్తం 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతాడ రవికుమార్‌ను ఏ1గా చేర్చారు.

## మహిళలను అవమానించడం వైసీపీ సంస్కృతి

మహిళా ఎస్సై పట్ల వైసీపీ నాయకులు ప్రవర్తించిన తీరు అత్యంత దారుణమని, ఇది రాష్ట్ర ప్రజలు తలదించుకునేలా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత విమర్శించారు. శుక్రవారం ఆమదావలస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ నాయకులు నిరంతరం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మహిళ లను అవమానించేలా ప్రవర్తించ డం ఆ పార్టీ సంస్కృతికి నిదర్శన మని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళల గౌరవానికి భంగం కలిగి స్తున్న అధికార పార్టీ నాయకులకు, వారి రాజకీయాలకు ప్రజలు రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతా రని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




* ఏ1గా చింతాడ రవికుమార్ * నాపై తప్పుడు కేసులు: చింతాడ రవికుమార్
* మహిళా ఎస్ఐపై దాడి అమానుషం: ఎమ్మెల్యే శిరీష, టీడీపీ మహిళా నేతలు

## దాడి అమానుషం: ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస:** బూర్జ పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రవల్లికను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం పరామర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తు విధుల్లో ఉన్న మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఎస్ఐను కలిసి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసు అధికారిపై అసభ్యంగా ప్రవర్తించడం, దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఘటనలో బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నాపై తప్పుడు కేసులు

* తోపులాట సమయంలో ఎస్ఐను పక్కకు వెళ్లమని చెప్పా * ఆమెపై మేం దౌర్జన్యం చేయలేదు * అక్రమ కేసులకు భయపడేది లేదు * పార్టీ అధినేత కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం * వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

**ఆమదాలవలస:** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు తరలివచ్చిన అశేష జనవాహినిని చూసి ఓర్వలేకే వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని ఆమదాలవలస పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో ప్రకటనను విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లాకు జగన్‌మోహన్ రెడ్డి రావడంతో ఆయనను చూసేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచే వేలాది మంది జగన్ అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమ అపూర్వ విజయాన్ని చూసి కూటమి ప్రభుత్వ పెద్దలు తట్టుకోలేకపోతున్నారు. అందుకే నాపై తప్పుడు కేసులు పెడుతున్నారు. సాక్షాత్తు రాష్ట్ర హోంమంత్రి, మరికొందరు మంత్రులు దీనిపై మీడియాలో లేనిపోని డిబేట్లు పెట్టి మాట్లాడుతున్నారు. వైఎస్ జగన్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులను పోలీసులు భారీ గేట్లు పెట్టి మరీ ఆపారు. ఆ సమయంలో స్వచ్ఛందంగా వచ్చిన కార్యకర్తల మధ్యలోకి బూర్జ మండలం ఎస్ఐ ప్రవల్లిక వచ్చారు. ఆమె నాకు ముందే బాగా పరిచయం. ఇటీవల ఆమె అనారోగ్యంతో కాస్త ఇబ్బంది కూడా పడ్డారు. వేలాది మంది జనం ఒక్కసారిగా ముందుకు వస్తుండటంతో, ప్రమాదం జరగకుండా ఆమెను పక్కకు వెళ్లమని నేను కేవలం రిక్వెస్ట్ చేశాను. ఆ సమయంలో జనం పెద్ద పెట్టున 'జై జగన్' అంటూ నినాదాలు చేయడంతో ఆమె చెవులు మూసుకున్నారు. దీంతో మేము ఆమెను చాలా జాగ్రత్తగా పక్కకు తీసుకెళ్లాం." అని రవికుమార్ స్పష్టతనిచ్చారు. అయితే ఆమెపై మేం దౌర్జన్యం చేశామని చెబుతూ పోలీసులు



నాపై 109, 189, 191, 221, 121, 74, 79, 351, 119 వంటి అనేక కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారన్నారు. హత్యానేరం, కుట్రలతో పాటు ఇతర అక్రమ కేసులు కూడా పెట్టారన్నారు. నాలాంటి సామాన్యుడిపై కూటమి ప్రభుత్వం కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కేసులకు నేను ఎంతమాత్రం భయపడను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడిన వ్యక్తిని నేను. భవిష్యత్తులో ఆయన కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా. అసలు ఏం జరిగిందో ప్రజలకు వాస్తవాలు తెలియజేయడానికే ఈ వీడియో విడుదల చేస్తున్నాన్నాని చింతాడ రవికుమార్ స్పష్టం చేశారు.

# సూర్యతేజలో.. లైంగిక వేధింపులు




* కంప్యూటర్ ఆపరేటర్ వికృత చేష్టలు * గత నెల 20న పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు * 21న కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు * పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు * ప్రైవేట్ విద్యా సంస్థలో భద్రత డొల్ల * యాజమాన్యం తీరుపై తల్లిదండ్రుల ఆందోళన * యాజమాన్యంపై చర్యలు చేపట్టాలన్న విద్యార్థి సంఘాలు

**పలాస, జులై 31 (వార్త):** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలు నేడు వ్యాపార కేంద్రాలుగా మారాయి. విద్యార్థినులకి రక్షణ కల్పించాల్సిన యాజమాన్యం చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యతేజ ప్రైవేట్ కళాశాలను ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో నడుస్తోంది. ఉపాధ్యాయుడు భార్య కరస్పాండెంట్‌గా ఉన్నారు. వీరు నడిపిస్తున్న కళాశాలలో గడిచిన ఆరేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కొవ్వూరు సాయి కిరణ్ ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు గత నెల 20వ తేదీన కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించింది. అదే సమయంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్ట్ ఉదంతం ఉండడంతో కాశీబుగ్గ పోలీసులు దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. నిందితుడిపై తక్షణ చర్యలు తీసుకోలేదన్న ఆవేదనతో బాధితురాలు నేరుగా డీఎస్పీని ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసింది. దీనికి స్పందించిన డీఎస్పీ వెంటనే కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితుడైన కంప్యూటర్ ఆపరేటర్ సాయి కిరణ్‌పై బీఎన్ఎ ఎస్ సెక్షన్లు 78(1)-(1), 351-2, పోక్సో చట్టం (11, 12) కింద కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇదే కళాశాలలో ఇటువంటి ఘటనలు జరిగినా యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. తమకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నాయని, పోలీసులు సైతం తమ చెప్పుచేతుల్లోనే ఉన్నారని, తమకేం కాదని యాజమాన్యం బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. యాజమాన్యం సైతం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల చెంతకు చేరుతుంటారన్న విమర్శలు కూడా లేకపోలేదు.

## ప్రైవేట్ కళాశాలలో విద్యార్థినులకు రక్షణ కరువు

పలాసలోని ప్రైవేట్ కళాశాలలో ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులు ఘటన కలకలం సృష్టించింది. తల్లిదండ్రుల్లో ఆందో ళనకు గురిచేసింది. కొందరు తమ పిల్లలను కళాశాలకు పంపించేందుకు ముందుకురావడం లేదు. ఈ సంఘటన జరిగినా విద్యాశాఖ అధికారులు.. ఆ కళాశాలను సందర్శించిన దాఖలాలు లేవు.

## ఉరికొయ్యకు వేలాడిన గిరిజన బిడ్డ

* కేజీబీవీ హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య * గదిలో ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం * కుటుంబ సభ్యుల అనుమానాలు, ఆందోళన * హాస్టల్ ఎదుట నిరసన * అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు * పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూపులు

**కొత్తూరు, జులై 31 (వార్త):** బంగారు భవిష్యత్తు కోసం ఇంటిని విడిచి చదువుకునేందుకు వచ్చిన ఓ గిరిజన విద్యార్థిని హాస్టల్ గదిలో శవంగా కనిపించడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కొత్తూరు మండల కేంద్రంలోని టైప్-4 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) వసతి గృహంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థిని ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో ఇది ఆత్మహత్యా? లేక మరేదైనా అనుమానాస్పద పరిస్థితుల ఫలితమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మృతురాలు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం లక్కయ్యగూడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని. ఆమె కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపీసీ) చదువుతూ కేజీబీవీ హాస్టల్‌లో నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం ఆమె గది తలుపు ఎంతసేపటికీ తెరుచుకోకపోవడంతో సహచర విద్యార్థినులు, సిబ్బంది వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మృతదేహం కనిపించింది. ఈ ఘటనతో హాస్టల్‌లో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, గిరిజన సంఘాల నాయకులు హాస్టల్‌కు చేరుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునే పరిస్థితిలో లేదని, ఆమె మరణంపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్సై వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలను సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మరణానికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



పోస్టుమార్టం నివేదిక, శాస్త్రీయ ఆధారాలు, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో హాస్టల్‌లోని విద్యార్థినులు భయాందోళనకు గురికాగా, తమ పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషాద ఘటన వెనుక ఉన్న వాస్తవాలు త్వరగా వెలుగులోకి రావాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**-అధికారులకు ఎమ్మెల్యే శిరీష ఆదేశం**

**-ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ**

**- 37 వినతుల స్వీకరణ**

**పలాస, జులై 31(వార్త):** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా పరిష్కార వేదిక-ప్రజా దర్బార్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని పలు గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు, భూ వివాదాలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 37 వినతిపత్రాలను ప్రజలు సమర్పించారు. ప్రతి వినతిని ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధిగా తమ బాధ్యత అని అన్నారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేయడం వల్ల వాటి పరిష్కారం వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## వీరగున్నమ్మపురంలో ఇంటింటికీ కూటమి



**మందస, జులై 31(వార్త):** ఇంటింటికీ కూటమి కార్యక్రమం కొనసాగుతోంది. మందస మండలం వీరగున్నపురంలో ఈ కార్యక్రమం శుక్రవారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ ఫలాలను ప్రతీ ఇంటికీ వివరిస్తూ, స్థానిక ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, టీడీపీ నాయకులు గుంట నారాయణరావు, గొర్లె హరీష్, రాఘవదాసు, వాయలపల్లి కుమారస్వామి, గొర్లె జోగారావు, కొవ్వూరు జోగారావు, గొర్లె రామకృష్ణ తదితర ముఖ్య నాయకులు, గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాధవరావుకు నాయకుల పరామర్శ

**-కామయ్య మృతి తీరని లోటు : టీడీపీ శ్రేణులు**



**మందస, జులై 31(వార్త):** తెలుగుదేశం పార్టీ మందస మండల ప్రధాన కార్యదర్శి సాలిన మాధవరావు తండ్రి సాలిన కామయ్య మరణించారు. ఆయన మృతి పార్టీ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. విషయం తెలిసిన మందస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సాలిన మాధవరావు నివాసానికి చేరుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కామయ్య భౌతిక దేహానికి నివాళులర్పించిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఆ దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. పరామర్శ కార్యక్రమంలో మందస మండల టీడీపీ అధ్యక్షుడు బావన దుర్యోధనతో పాటు నాయకులు లబ్బ రుద్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, అడ్డి ఈశ్వరరావు, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ సానుభూతిని తెలిపారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్పిలి వెంకటరావు

**- అభినందనలు తెలిపిన పార్టీ నాయకులు**

**మందస, జులై 31(వార్త):** జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్పిలి వెంకటరావును జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరావు నియమించారు. వెంకటరావును ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు ఇప్పిలి వెంకటరావు సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు, విజయనగరం జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ పసుపులేటి సురేష్ బాబు సింగ్, రాష్ట్ర ఐటీ కన్వీనర్ చిగులిపల్లి వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగిలిపల్లి రాజేష్, బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.మదన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పేరూరు శ్రీనివాసరావు, కలకదండు సూరిబాబు, బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావు, ఓబీసీ కార్యవర్గ సభ్యుడు సుంకరి రవి, బీజేపీ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి బి.గోపి, పొందూరు మండల ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొనీ శ్రీకాకుళం జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు అందరూ అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ఓబీసీ జోనల్ రాష్ట్ర ఇన్ చార్జి రౌతు చిరంజీవిరావు, ఉయ్ ఫర్ ఆల్ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుసు మురళీకృష్ణ, కొంచాడ సురేష్ కుమార్, వజ్రపుకొత్తూరు ఓబీసీ మండల అధ్యక్షుడు బి.సూర్యనారాయణ, మందస ఓబీసీ మండల అధ్యక్షుడు బతకల చంద్రయ్య తదితరులు ఉన్నారు.



## జిల్లాలో ద్వితీయ స్థానం

**-భోగాపురంలో ప్రధాని చేతుల మీదుగా సత్కారం**

**- నగరంపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి**

**లిఖిత్ సాయికి అరుదైన గౌరవం**

**పలాస, జులై 31(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎల్. లిఖిత్ సాయి జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ చాటాడు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న జిల్లా కేంద్రంలో 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' ప్రధానాంశంగా, 'మన జిల్లా ఎదుగుతుంది' ఉపాంశంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో అతడు ఈ ఘనత సాధించాడు. ఈ సందర్భంగా భోగాపురంలో శనివారం జరిగే అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా లిఖిత్ సాయి బహుమతి అందుకోనున్నాడు. విద్యార్థి విజయానికి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు గైడ్ టీచర్‌గా మార్గనిర్దేశనం చేశారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. హేమరావు, ఎస్ఎంసీ చైర్మన్ బి. లక్ష్మీపతి, ఉపాధ్యాయులు విద్యార్థి లిఖిత్ సాయి, గైడ్ టీచర్ శ్రీనివాసరావును అభినందించి, భోగాపురంలో జరిగే సత్కార కార్యక్రమానికి శుభాకాంక్షలు తెలిపారు.



# మహిళలకు సంపూర్ణ అవగాహనతోనే ఆర్థిక సాధికారిత



**మందస, జులై 31(వార్త):** మహిళా సంఘాలకు సరైన పుస్తక నిర్వహణతో పాటు అన్ని రకాల ప్రభుత్వ స్కీమ్ లు,పథకాలపై సంపూర్ణ అవగాహనతోనే ఆర్థిక సాధికారిత సాధ్యపడుతుందని, వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో భోగాపురం ఎయిర్ పోర్టు సందర్శనార్థం వెళ్లడానికి గ్రామ పెద్దలతో పాటు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ సంఘం అధ్యక్షురాలు దున్న యశోద ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం సూపర్ నారీ యాప్ డౌన్ లోడ్ చేసుకోవడం కోసం అవగాహన కల్పిస్తూ, రాంపురం, బిడిమి తదితర గ్రామాల్లో గల మహిళా సంఘాలతో ర్యాలీలు నిర్వహిస్తూ, మహిళలకు అన్ని రకాల స్కీమ్ లు పథకాలపై సంపూర్ణగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం డౌన్ లోడ్ చేసుకుంటున్న సూపర్ నారీ యాప్ ద్వారా ప్రతీ సంఘంలో కూడా సభ్యురాలు వారీ లెక్కలు క్షుణ్ణంగా తెలుస్తాయని మహిళలకు తెలిపారు. అందరు సభ్యులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉంటేనే ,మహిళలకు ఆర్థికాబివృద్ధి సాధ్యపడుతూ, ప్రతీ మహిళా ఒక ఎంటర్ ప్రైనర్ గా తయారు కావడానికి దోహదపడుతుందని ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు కోరమేనా చేప పిల్లల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం బస్ ఇంచార్జి వీఆర్వో క్రాంతి, వెటర్నరీ అసిస్టెంట్ గొల్లపల్లి కళ్యాణ్, గ్రామ పెద్దలు జుత్తు కృష్ణమూర్తి, దున్న పరమేశ్వరరావు, ఎస్.సారధి, జోగారావు, దినేష్, ఈనారీ సిఆర్పిలు, స్థానిక వీఓఏలు శశిరేఖ, లక్ష్మి వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ ముఖలింగం, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విత్తన బంతులతో అడవుల అభివృద్ధి

**- హెున్నాళి ఆర్ఎఫ్‌లో డ్రోన్లతో విత్తన బంతులు**

**మందస, జులై 31(వార్త):** ప్రతీ ఒక్కరూ అడవులను పెంచాలని కాశీబుగ్గ రేంజ్ అధికారి పి.అమ్మన్నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి టి.దేవరాజు అన్నారు. మందస మండలంలోని హెున్నాళి రిజర్వ్ ఫారెస్ట్ లో డ్రోన్ల సహాయంతో విత్తనబంతులను వెదజల్లారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణకు అడవులు మేలు చేస్తాయని, అడవుల అభివృద్ధి, సంరక్షణ, పెంపకాని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో అడవుల సంరక్షణ, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. డ్రోన్ల సాయంతో ఈ ప్రాంతంలోని అటవీ భూముల్లో విత్తన బంతులను వెదజల్లడం జరుగుతోందన్నారు. విత్తన బంతులు రిజర్వ్ అడవులు, ఖాళీ ప్రదేశాల్లో మనుషుల ద్వారా, డ్రోన్ల ద్వారా వెదజల్లుట జరుగుతోందన్నారు. దీని ద్వారా అడవులు అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి టి.దేవరాజు, అటవీశాఖ ఫారెస్ట్ బీట్ అధికారులు పి.లక్ష్మణమూర్తి, టి.వెంకటేష్, ఆర్.జోగారావు, ఎస్.దుర్గాదేవి, ఎ.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# వీజీ పురం కేజీబీవీలో విద్యార్థినులకు కంటి పరీక్షలు

**మందస, జులై 31(వార్త):** కస్తూరిబాగాంధీ విద్యాలయంలో విద్యార్థినిలకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరగున్నమ్మ పురం(జీఆర్ పురం)సమీపంలో గల కేజీబీవీలో నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ 210మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందికి దృష్టి లోపం ఉన్నందున కంటి అద్దాలకు సిఫార్సు చేయడం జరిగిందని వెంకటరమణ తెలిపారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణ పై పట్ల విద్యార్థులు కు అవగాహన కల్పించారు. కార్యక్రమం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రఘుపాత్రుని వాసంతి అధ్యక్షతన నిర్వహించగా.. హెల్త్ సెక్రటరీ జి.ప్రసన్నలత, ఆశా వర్కర్లు జి.పద్మలత, కె. రోహిణి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.కాంతారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## భూసార పరీక్షలతో రైతులకు ఉపయోగం

**- రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకటరావు**



**మందస, జులై 31(వార్త):** వ్యవసాయం భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం, భూసార పరీక్ష కేంద్రం(ఆముదాలవలస) అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరక్టర్ సీహెచ్ వెంకటరావు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ, అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం జిల్లా వనరుల కేంద్రం, భూసార పరీక్ష కేంద్రం ఆమదాలవలస ఆధ్వర్యంలో స్కూల్ సోయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మట్టి నమూనాలు తీసే విధానం, ల్యాబ్ లో పరీక్ష చేసే విధానం, మట్టి నమూనాలు ఆవశ్యకత, సమస్యాత్మక పొలాలకు పరిష్కారాలను విద్యార్థులకు వివరించారు. ఆదునిక వ్యవసాయానికి మట్టి నమూనాలు తప్పని సరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకటరావు, భూసార పరీక్ష కేంద్రం ఆమదాలవలస సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రవికుమార్, మందస మండల వ్యవసాయ అధికారి జి.నాగరాజు గ్రామ వ్యవసాయ సహాయకులు, స్కూల్ సైన్స్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా ఎస్ఐపై వైసీపీ నేతల దాష్టీకం హేయం

**- పేడాడ రామ్మోహన్ రావు**

**ఆమదాలవలస, జులై 31(వార్త):** ఆముదాలవలస జనసేన ఇన్‌ఛార్జ్ పేడాడ రామ్మోహన్ రావు మహిళా పోలీసు అధికారిపై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్ఐ పట్ల ఆముదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ ప్రవర్తించిన తీరు అత్యంత అభ్యంతరకరమని ఆయన విమర్శించారు. చట్టాన్ని అమలు చేసే మహిళా పోలీసు అధికారిపై దౌర్జన్యంగా ప్రవర్తించడం వైసీపీ నాయకుల అనాగరిక రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ఆయన అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ నాయకుల అహంకారం, మహిళల పట్ల వారి వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఈ ఘటన స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. మహిళల గౌరవం, భద్రతకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిని సమాజం సహించదని పేడాడ రామ్మోహన్ రావు హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్ఐపై దాష్టీకానికి పాల్పడిన చింతాడ రవికుమార్‌తో పాటు ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపై పోలీసులు తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో చట్టాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులపై దౌర్జన్యాలకు పాల్పడే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

# వినయ్‌పూర్వకంగా వైద్య సేవలు

- సేవే లక్ష్యంగా..
సమయానికి ముందే ఆసుపత్రికి
- అత్యవసర వేళల్లోనూ అందుబాటులో.. ప్రజారోగ్య కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర
-పీహెచ్‌సీతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రాల్లోనూ వైద్య సేవలు
-ఆదర్శంగా నిలుస్తున్న గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్.



**వజ్రపుకొత్తూరు, జులై 31 ( వార్త):** వైద్యమే నారాయణ హరి అంటారు. ఆ మాటకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్. వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా ప్రజలకు సేవ చేసే పవిత్రమైన బాధ్యతగా భావిస్తూ నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. సమయానికి ముందే ఆసుపత్రికి చేరుకోవడం నుంచి అత్యవసర కేసులకు తక్షణ వైద్యం అందించడం వరకు ఆయన చూపుతున్న నిబద్ధత స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

## ఉదయం 9 గంటలకే ఆసుపత్రిలో..

ఆసుపత్రి సాధారణ విధుల సమయానికి ముందే ఉదయం 8 నుండి 9 గంటల లోపే పీహెచ్‌సీకి చేరుకోవడం డాక్టర్ వినయ్ ప్రత్యేకతగా మారింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఎక్కువసేపు నిరీక్షించకూడదనే ఉద్దేశంతో ముందుగానే ఆసుపత్రికి చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విధుల సమయం ముగిసిన తర్వాత కూడా అవసరమైన సందర్భాల్లో రోగులకు అందుబాటులో ఉంటున్నారు.

## ఎమర్జెన్సీ అంటే.. వెంటనే స్పందన

పాముకాటు, ప్రమాదాలు, ఇతర అత్యవసర ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు డాక్టర్ వినయ్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాముకాటు వంటి ఘటనల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకమని గుర్తించి, తక్షణ వైద్యం అందించడంతో పాటు అవసరమైనప్పుడు మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి వేళల్లోనూ అత్యవసర పరిస్థితుల్లో స్పందించి ఆసుపత్రికి చేరుకుని వైద్యం అందించిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.



## సిబ్బందితో సమన్వయం..

ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందేందుకు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. రోగుల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన వైద్యం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు.

## పల్స్ పోలియోలోనూ ముందంజ

ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో తదితర ప్రజారోగ్య కార్యక్రమాల్లోనూ డాక్టర్ వినయ్ చురుగ్గా పాల్గొంటున్నారు. కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడం, లక్షిత వర్గాలకు ప్రభుత్వ ఆరోగ్య సేవలు చేరేలా చూడటంలో ముందుంటున్నారు.

## ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రాల్లోనూ సేవలు

పీహెచ్‌సీకే పరిమితం కాకుండా ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రాల్లోనూ వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నారు. అవసరమైన సందర్భాల్లో రోగుల పరిస్థితిని పరిశీలించి తదుపరి వైద్యానికి మార్గనిర్దేశం చేస్తున్నారు.

## సమయం ఏదైనా.. సేవే ధ్యేయం

ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా అవసరమైనప్పుడు రోగులకు వైద్యం అందించడం ఆయన పనితీరులో ప్రత్యేకత. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి వేళల్లోనూ స్పందిస్తూ రోగులకు భరోసా కల్పిస్తున్నారు. వైద్యుడిగా తనపై ఉన్న బాధ్యతను గుర్తించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న ఆయన సేవలను రోగులు, వారి కుటుంబ సభ్యులు అభినందిస్తున్నారు.

## ఉత్తమ వైద్యాధికారిగా నిలవాలన్న లక్ష్యం

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల్లో ఉత్తమ స్థానంలో నిలవాలన్న లక్ష్యంతో డాక్టర్ వినయ్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా విధులు నిర్వహించాలన్నదే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సమయానికి అందుబాటులో ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడం, ప్రజారోగ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో కీలకం. ఈ అంశాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న డాక్టర్ వినయ్ పనితీరు ఇతర ప్రభుత్వ వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## వైద్యం ఉద్యోగం కాదు.. బాధ్యత

వైద్యం ఒక వృత్తి మాత్రమే కాదు.. ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత. ఆ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సమయానికి ముందే ఆసుపత్రికి చేరుకుని, అత్యవసర వేళల్లోనూ స్పందిస్తూ, పల్స్ పోలియో వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్న డాక్టర్ వినయ్ సేవలు అభినందనీయం.

# ప్రజా ఆదరణే జగన్ బలం

-జగన్ పర్యటన విజయవంతం చేసిన శ్రేణులకు కృతజ్ఞతలు
- వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు



**పలాస, జులై 31(వార్త):** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు తెలిపారు. పలాసలో శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజును పరామర్శించేందుకు వచ్చిన జగన్ పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ సిదిరి అప్పలరాజుపై నమోదు చేసిన కేసు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన ఆరోపించారు. విశాఖ నుంచి శ్రీకాకుళం జిల్లా జైలు వరకు జగన్ ప్రయాణించిన మార్గమంతా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారని పేర్కొన్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పలు ఆంక్షలు విధించినప్పటికీ ప్రజల స్పందన ఏమాత్రం తగ్గలేదన్నారు. జగన్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ ఇప్పటికీ కొనసాగుతోందని, గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల కారణంగానే ప్రజలు ఆయనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, వాలంటీర్ వ్యవస్థ వంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నేతల పర్యటనలకు ఆటంకాలు కల్పించడం, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రతిపక్ష హక్కులను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. రాష్ట్రంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు వంటి ప్రజా సమస్యలు పెరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటుందని దుర్యోధన రావు స్పష్టం చేశారు. ప్రజల నుంచి లభించిన ఆదరణ పార్టీకి మరింత ఉత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి విమానాశ్రయం మైలురాయి

- భోగాపురం ప్రారంభోత్సవానికి క్షేత్రస్థాయిలో ముమ్మర ఏర్పాట్లు
- కార్యకర్తల భోజన ఏర్పాట్లను పరిశీలించిన వజ్జ బాబూరావు



**పలాస, జులై 31(వార్త):** ఉత్తరాంధ్ర అభివృద్ధికి విమానాశ్రయం మైలురాయని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్షగా భావిస్తున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, తాగునీరు, విశ్రాంతి, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీటీపీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, జి.సిగడాం మండలాల నుంచి ప్రారంభోత్సవానికి తరలివచ్చే కార్యకర్తల కోసం ఏర్పాటు చేస్తున్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు తాగునీరు, విశ్రాంతి, రవాణా తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఉండేలా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నందున అన్ని ఏర్పాట్లలో సమన్వయం పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, పర్యాటకం, ఎగుమతులు పెరిగి ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, కూటమి ప్రభుత్వ కృషి ఫలితంగానే ఈ ప్రాజెక్టు సాకారమైందని అన్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా జరిగే ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయడం ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాధ్యత అని పేర్కొంటూ, లావేరు, జి.సిగడాం మండలాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఉద్దంసింగ్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు కొనసాగించాలి

**పలాస, జులై 31(వార్త):** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన గదర్ ఉద్యమ వీరుడు కామ్రేడ్ ఉద్దం సింగ్ 86వ సంస్మరణ సభను పిడిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మాకనపల్లిలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు సభకు పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పిడిఎం రాష్ట్ర అధ్యక్షుడు జె. వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో ప్రజల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలు తొలగించి కొత్త ఉత్తేజాన్ని నింపాయని అన్నారు. కామ్రేడ్ ఉద్దం సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు తమ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి ధాణేష్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో ప్రజలు పేదరికంలోకి నెట్టివేయబడ్డారని, విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేక యువత ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బందులు పడుతోందని విమర్శించారు. కొద్దిమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రశ్నించే వారిపై యూఏపీఏ వంటి చట్టాల కింద కేసులు నమోదు చేసి అణచివేస్తోందని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం ప్రజల్లో భరోసా కల్పించిందని, ఉద్దం సింగ్ స్ఫూర్తితో రైతులు, యువత కలిసి మరో స్వాతంత్ర్య స్ఫూర్తి పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, ఏబీఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు తామాడ త్రిలోచన్, జీడిపిక్కల పోరాట సంఘం నాయకుడు అజయ్, మహిళా సంఘం నాయకురాలు నాగమణి, పిడిఎం నాయకులు లక్ష్మణ్, దుర్యోధన, గంగయ్య, కళాకారులు చిరంజీవి, లత, గణపతి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

# భూ పోరాట విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

- 8న ఎస్టీ మాకివలసలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సభ
-ఇది జిల్లా ఆదివాసీ సమాజం సాధించిన విజయమని వాబ యోగి వ్యాఖ్య



**జలుమూరు, జులై 31 (వార్త):** ఎస్టీ మాకివలస గ్రామంలో ఆదివాసి ప్రజలు రెండున్నర సంవత్సరాల పాటు సాగించిన భూ పోరాటం విజయవంతమైన సందర్భంగా ఆగస్టు 8న భూ పోరాట విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు ఆదివాసి సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ. యోగి తెలిపారు. శుక్రవారం ఎస్టీ మాకివలస గ్రామంలో విజయోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, “ఈ అడవి మాదే – ఈ భూమి మాదే” అనే నినాదంతో ఆదివాసి గ్రామస్తులు ఐక్యంగా రెండున్నర సంవత్సరాల పాటు సాగించిన ఉద్యమ ఫలితంగానే భూమిని సాధించుకున్నారని పేర్కొన్నారు. ఎస్టీ మాకివలస గ్రామ ప్రజలు సాధించిన ఈ విజయం కేవలం ఒక గ్రామానికే పరిమితం కాదని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసి సమాజం సాధించిన విజయంగా భావించాలని అన్నారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఎస్టీ మాకివలస ఆదివాసులు మరోసారి నిరూపించారని కొనియాడారు. ఆగస్టు 8న నిర్వహించనున్న భూ పోరాట విజయోత్సవ సభను ఆదివాసులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు బోడవలస పాపారావు, కొర్రై ప్రసాద్, సురపు నాయుడు, పడాల పోలయ్య, బోడవలస ఆనందరావు, పులికట్టు భద్రమ్మ, చిన్నింటి శ్రీనమ్మ, ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రణతికి ద్వితీయ స్థానం


- శ్రీముఖలింగం జడ్పీ పాఠశాల
విద్యార్థిని ప్రతిభకు ప్రశంసలు



**జలుమూరు, జులై 31 (వార్త):** జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జలుమూరు మండలం శ్రీముఖలింగం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని డి. ప్రణతి ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చింది. ఈ విషయాన్ని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రణతి, అంతకుముందు నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో కూడా ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి అర్హత పొందిందని తెలిపారు. విద్యార్థిని సాధించిన విజయంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె ప్రతిభ, కృషి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహచర విద్యార్థులు ప్రణతిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# నరసన్నపేటలో 17,167 ఓట్లు తొలగింపు

**నరసన్నపేట, జులై 31(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహించిన ఇంటింటా సర్వే అనంతరం మొత్తం 17,167 ఓట్లను తొలగించినట్లు ఎన్నికల అధికారి జి. జయదేవి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో నమోదైన మొత్తం 2,16,975 మంది ఓటర్ల వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆమె వెల్లడించారు. పరిశీలన అనంతరం అర్హత కలిగిన 1,99,808 మంది ఓటర్లతో ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. తయారు చేసిన ముసాయిదా ఓటరు జాబితాను నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సంబంధిత అధికారులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత లక్ష్యంగా ఇంటింటా సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లను తొలగించేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ముసాయిదా జాబితాను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు సూచించాలని ఎన్నికల అధికారి జి. జయదేవి కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అదుపు తప్పిన ఆటో బీభత్సం

- బైక్‌ను ఢీకొట్టి షాపులోకి దూసుకెళ్లిన వైనం
- ఇద్దరికి స్వల్ప గాయాలు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**నరసన్నపేట, జులై 31(వార్త):** నరసన్నపేట కొత్త బస్టాండ్ వద్ద శుక్రవారం అదుపుతప్పిన ఓ ఆటో బీభత్సం సృష్టించింది. ప్రయాణికులతో నిలిపి ఉంచిన ఆటో అకస్మాత్తుగా ముందుకు దూసుకెళ్లి ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఆ బైక్ సమీపంలోని దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం, కొత్త బస్టాండ్ వద్ద ప్రయాణికులను ఎక్కించేందుకు నిలిపి ఉంచిన ఆటో అనూహ్యంగా కదలడంతో సమీపంలో ఉన్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి బైక్ పక్కనే ఉన్న షాపులోకి వెళ్లిపోవడంతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడగా, వారికి స్థానికులు వెంటనే ప్రాథమిక చికిత్స అందించారు. ప్రమాద సమయంలో షాపు ముందు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనతో బస్టాండ్ పరిసరాల్లో కొద్దిసేపు రద్దీ ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బస్టాండ్ పరిసరాల్లో వాహనాలను నిర్లక్ష్యంగా నిలిపివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



## సారవకోట కేజీబీవీకి సౌండ్ బాక్స్ వితరణ



**సారవకోట, జులై 31(వార్త):** సారవకోట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారిని కాంతమ్మ , ఉపాధ్యాయ సిబ్బంది కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ వసతి గృహంలో దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉండడం వల్ల బాలికల ఆరోగ్య విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కాబట్టి కీటక నియంత్రణని అవసరమని, విద్యాలయంలో ప్రార్థన సమయంలో, విద్యార్థులను అందర్నీ ఒక దగ్గర సమూహపరిచి వివిధ కార్యక్రమాలు చేయాలంటే సౌండ్ బాక్స్ స్పీకర్ అవసరం పడుతుందని ఇటీవల జరిగిన ఉపాధ్యాయ తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బిసి కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్‌కి తెలియజేయడంతో ధర్మాన తేజ్ కుమార్ గారు తన సొంత నిధులు వెచ్చించి ఈరోజు కీటక నియంత్రిని, సౌండ్ బాక్స్ స్పీకర్ సారవకోట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సారవకోట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సురవరపు తిరుపతిరావు, సారవకోట మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్,సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షులు పిళ్ళా నందకిషోర్ , సారవకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సిరిపురం అప్పలనాయుడు ,ఇసై హేమసుందర్,మామిడి ఆనందరావు ,బోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

## సయ్యద్ ఖాన్ చెరువుగట్టు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



**ఇచ్ఛాపురం, జులై 31 (వార్త):** మున్సిపాలిటీ పరిధి సయ్యద్ ఖాన్ చెరువు గట్టుపై కొంతమంది అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని 23 వ వార్డు మాజీ కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ కుమార్ అన్నారు. చెరువులు వాటి గట్లు ప్రజల ఆస్తి అని వీటిని ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, భవిష్యత్తులో వరదలు ఏర్పడి పర్యావరణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. అందువల్ల మున్సిపల్ అధికారులు,రెవెన్యూ శాఖ స్పందించి తగిన చర్య తీసుకోవాల్సిందిగా కోరారు.

## చెట్టుకు ఉరివేసుకొని గుర్తుతెలియని యువకుడి మృతి

**పలాస, జులై 31 (వార్త):** పలాస మండలం సుమ్మాదేవి జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం శుక్రవారం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు గమనించి వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతుడి గుర్తింపు, ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## మాజీ మంత్రి అప్పలరాజుకు చుక్కెదురు

**శ్రీకాకుళం, జులై 31 (వార్త):** వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సాక్ష్యాలు తారుమారు చేసిన కేసులో ఆయన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పలరాజు కుమారుడు ఆరవ్‌వర్మ బైక్ ఢీకొని గొర్రెల కాపరి దానయ్య మృతి చెందాడు. ఈ కేసులో కుమారుడిని రక్షించేందుకు సాక్ష్యాలు తారుమారు చేసినట్లు అప్పలరాజుపై అభియోగాలు వచ్చాయి. దీంతో ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు రిమాండ్ విధించడంతో శ్రీకాకుళం సమీపంలోని అంపోలు జైలుకు తరలించారు.

## జిల్లాలో మొత్తం ఓటర్లు 17.24 లక్షలు

**శ్రీకాకుళం, జులై 31 (వార్త):**ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) - 2026 కార్యక్రమంలో భాగంగా జులై 31 నాటికి సిద్ధం చేసిన ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను విడుదల చేసి, వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,24,896 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుష ఓటర్లు 8,54,771 మంది కాగా, మహిళా ఓటర్లు 8,70,051 మంది, తృతీయ లింగ ఓటర్లు 74 మంది ఉన్నారని స్పష్టం చేశారు.జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శ్రీకాకుళం నియోజకవర్గం 2,51,218 మంది ఓటర్లతో మొదటి స్థానంలో నిలవగా, ఆముదాలవలస 1,77,870 మందితో చివరి స్థానంలో ఉంది. నియోజకవర్గాల వారీగా వివరాలు చూస్తే.. శ్రీకాకుళంలో 2,51,218 మంది (పురుషులు: 1,23,861, మహిళలు: 1,27,336, తృతీయ లింగం: 21), ఇచ్ఛాపురంలో 2,41,599 మంది (పురుషులు: 1,17,372, మహిళలు: 1,24,211, తృతీయ లింగం: 16), ఎచ్చెర్లలో 2,26,142 మంది (పురుషులు: 1,13,869, మహిళలు: 1,12,261, తృతీయ లింగం: 12), టెక్కలిలో 2,17,824 మంది (పురుషులు: 1,08,689, మహిళలు: 1,09,129, తృతీయ లింగం: 6), పాతపట్నంలో 2,08,607 మంది (పురుషులు: 1,03,980, మహిళలు: 1,04,620, తృతీయ లింగం: 7), పలాసలో 2,01,828 మంది (పురుషులు: 98,523, మహిళలు: 1,03,297, తృతీయ లింగం: 8), నరసన్నపేటలో 1,99,808 మంది (పురుషులు: 99,820, మహిళలు: 99,985, తృతీయ లింగం: 3), ఆముదాలవలస నియోజకవర్గంలో 1,77,870 మంది (పురుషులు: 88,657, మహిళలు: 89,212, తృతీయ లింగం: 1) ఓటర్లు నమోదయ్యారు.అలాగే జిల్లా వ్యాప్తంగా మొత్తం 15,983 మంది సర్వీస్ ఓటర్లు (పురుషులు: 15,386, మహిళలు: 597) ఉండగా, 59 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు (పురుషులు: 51, మహిళలు: 8) ఉన్నారు. నియోజకవర్గాల వారీగా సర్వీస్ ఓటర్ల విషయానికొస్తే ఇచ్ఛాపురంలో 1,955, పలాసలో 2,945, టెక్కలిలో 2,830, పాతపట్నంలో 1,772, శ్రీకాకుళంలో 1,231, ఆముదాలవలసలో 2,184, ఎచ్చెర్లలో 918 మరియు నరసన్నపేటలో 2,148 మంది నమోదయ్యారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లలో ఇచ్ఛాపురంలో 10, పలాసలో 1, టెక్కలిలో 11, పాతపట్నంలో 5, శ్రీకాకుళంలో 23, ఆముదాలవలసలో 3, ఎచ్చెర్లలో 4, నరసన్నపేటలో 2 మంది ఉన్నారని అన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ప్రతి ఓటరు తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పేరు నమోదు కాకపోయినా లేదా ఏవైనా తప్పులు, డూప్లికేట్ నమోదులు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్లు ఉన్నట్లయితే సంబంధిత ఈఆర్ఓ లేదా ఏఈఆర్ఓ కార్యాలయాలను సంప్రదించి జులై 31 నుండి ఆగస్టు 30 వరకు ఫారం-6, ఫారం-7 లేదా ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు టైరు పేలి ఇద్దరు మహిళలకు గాయాలు

- నరసన్నపేటలో ఘటన
- ఆసుపత్రికి తరలించిన స్థానికులు




**నరసన్నపేట, జులై 31(వార్త):** నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఉదయం నిలిపి ఉంచిన బస్సు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో సమీపంలో ఉన్న ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటనతో కాంప్లెక్స్‌లో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. సమాచారం ప్రకారం, కాంప్లెక్స్ ఆవరణలో బస్సును పార్కింగ్ చేసిన అనంతరం డ్రైవర్, కండక్టర్ అల్పాహారం కోసం వెళ్లారు. ఈ సమయంలో ఒక్కసారిగా బస్సు టైరు భారీ శబ్దంతో పేలింది. టైరు పేలిన ప్రభావంతో బస్సు సమీపంలో ఉన్న పద్మావతి, భానుమతి అనే ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఆర్టీసీ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. బస్సుల నిర్వహణ, టైర్ల తనిఖీలను మరింత పటిష్టంగా చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



## బస్సులన్నీ భోగాపురానికే..!

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి బస్సుల తరలింపు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

**శ్రీకాకుళం, జులై 31(వార్త):** విజయనగరం: భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్టీసీ అధికారులు పెద్ద సంఖ్యలో బస్సులను తరలించడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పలు రూట్లలో బస్సుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్ స్టాప్‌ల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, రోజువారీ కూలీలు, అత్యవసర పనుల కోసం ప్రయాణించే వారు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి రావడంతో అదనపు ఖర్చు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాల కోసం బస్సులను వినియోగించడం అవసరమే అయినప్పటికీ, సాధారణ ప్రజా రవాణా సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులను తరలించిన మార్గాల్లో తాత్కాలికంగా అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







## విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి బోధించాలి

- దేవాది ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ దాలినాయుడు
- వర్క్‌బుక్‌ల పరిశీలన.. ఉపాధ్యాయులకు పలు సూచనలు



**నరసన్నపేట, జులై 31(వార్త):** ప్రతి విద్యార్థిలోని నైపుణ్యాలను తప్పనిసరిగా గుర్తించి, వాటికి అనుగుణంగా బోధన అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) దాలినాయుడు సూచించారు. శుక్రవారం నరసన్నపేట మండలం దేవాది ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను తనిఖీ చేసి బోధన తీరుపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని నిరంతరం అంచనా వేస్తూ వారి బలాలు, బలహీనతలను గుర్తించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని వెలికితీసి ప్రోత్సహించడం ద్వారా మెరుగైన విద్యా ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన అందిస్తూ ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి అభ్యాసంలో ఉన్న లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడిన ఎంఈఓ పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలపై వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు.

## చీమలవలసలో పంట నమోదు ప్రారంభం

**ఆమదాలవలస, జులై 31(వార్త):** చీమలవలస రైతు సేవా కేంద్రం పరిధిలోని కొర్లకోట రెవెన్యూ గ్రామంలో ఖరీఫ్--2026 సీజన్‌కు సంబంధించిన పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గ్రామ వ్యవసాయ సహాయకుడు నూక భగవత్ కుమార్ తెలిపారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, ధాన్యం కొనుగోలు వంటి సేవలు సకాలంలో అందేందుకు పంట నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కొర్లకోట రెవెన్యూ గ్రామ పరిధిలో మొత్తం 1,493 ఎకరాల్లో వరి సాగు జరగనున్నట్లు అంచనా వేయగా, సుమారు 6,500 కమతాల్లో పంట నమోదు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి విడతలో సర్వే నంబర్లు 90 నుంచి 118 వరకు రైతుల సమక్షంలో పంట నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మిగిలిన సర్వే నంబర్లలో కూడా ముందుగా రూపొందించిన షెడ్యూల్ ప్రకారం నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. పంట నమోదు నిర్వహించే సర్వే నంబర్లు, తేదీ, సమయాన్ని ఒక రోజు ముందుగానే రైతుల మొబైల్ ఫోన్లకు ట్రామీ ద్వారా తెలియజేస్తామని తెలిపారు. రైతులు నిర్ణీత తేదీ, సమయానికి తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి నమోదు ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని కోరారు. కౌలు రైతులు ఉన్నట్లయితే వారి పూర్తి వివరాలను ముందుగానే రైతు సేవా కేంద్రానికి అందజేయాలని సూచించారు. అలాగే మరణించిన రైతుల భూములు లేదా విదేశాల్లో నివసిస్తున్న భూ యజమానుల భూములను సాగు చేస్తున్న కౌలు రైతుల వివరాలు సమర్పించినట్లయితే, ప్రభుత్వ నిబంధనల మేరకు వారి పేరుపై కూడా పంట నమోదు చేసి, ధాన్యం కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. పంట నమోదు నిర్ణీత గడువులో పూర్తిచేయాల్సి ఉన్నందున రైతులందరూ తమ వివరాలను త్వరితగతిన రైతు సేవా కేంద్రానికి అందజేసి, వ్యవసాయ శాఖ నుంచి వచ్చే ట్రామీ ప్రకారం నిర్ణీత తేదీ, సమయానికి పొలాల వద్ద హాజరై పంట నమోదును పూర్తి చేసుకోవాలని గ్రామ వ్యవసాయ సహాయకుడు నూక భగవత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546